సిగరెట్ కేసు

టెంపోరావ్

గంగాధర్, నిక్సన్, మస్తాన్, సూర్యదేవ్, పుష్క రాజు అమీర్ కేఫ్ కాబిన్‌లో కూర్చున్నారు. టైం తొమ్మిది దాటింది.

కాబిన్‌లో వున్న ఫ్లోరసెంట్ లైటు వెల్గుతోంది. వాళ్ళు గాడ్ ఫాదర్ సినిమా చూసి అటుపైన అమీర్ కేఫ్‌కి చేరుకున్నారు. అందరికీ ఆకలిగా వుంది.

బేరర్ లోపలకు వచ్చాడు. అతడివైపు గంగాధర్ సూటిగా చూశాడు.

"ముందట కూల్ వాటర్ పట్రా. ఐదు ఖాళీగ్లాసులు కావాలి. తర్వాత టండూరీ చికెన్, మటన్ బిర్యానీ!" గంగాధర్ ఆర్డరిచ్చాడు.

బేరర్ వెళ్ళిపోయాడు. కాస్సేపట్లో అతడు తిరిగొచ్చి ఐదు గ్లాసులను టేబిల్ మీద వుంచాడు. పెద్ద స్టెయిన్ లెస్ స్టీల్ పాత్రలో నీళ్లు పెట్టి, తలుపు తెర్చుకొని వెళ్ళి పోయాడు.

మూసుకుపోయిన తలుపువంక ఒకసారిచూసి గంగాధర్ తన పాంటుజేబులోంచి ఒక హాఫ్‌విస్కీ బాటిల్ని బయటకు తీశాడు. ఐదు గ్లాసుల్లోనూ విస్కీని సర్ది పోశాడు. వాళ్ళు గ్లాసుల్లో కొంచెం నీళ్ళుపోసుకున్నారు. అందరూ గ్లాసులను ఎత్తిపట్టుకున్నారు.

"చియర్స్!" అని అందరూ తాగడం ప్రారంభించారు.

గంగాధర్ తన గ్లాసులోని విస్కీని గడగడా తాగేసి ఖాళీగ్లాసును టేబిల్ మీద వుంచి, పెనామా సిగరెట్ వెలిగించాడు. సిగరెట్ పాకెట్‌ను టేబుల్ మీద పడేశాడు.

తతిమావాళ్లు మెల్లిగా తాగుతున్నారు. వాళ్లుకూడా సిగరెట్లు వెలిగించారు. గంగాధర్ పొగనువదుల్తూ అందరివైపూ చూశాడు.

"మనకి గాడ్‌ఫాదర్ లాంటివాడు కావాలి! అంతవరకూ మనదేశం బాగుపడదు!" అన్నాడు గంగాధర్ తన బొంగురు కంఠంతో.

తతిమావాళ్ళు అతడివంక చూశారు. గంగాధర్ పొడుగ్గా, బలంగా వుంటాడు. బి. ఎ. పాసయ్యాడు కాని వుద్యోగం లేదు. మూడేళ్ళపాటు వుద్యోగంకోసం వెతికి, వెతికి విసుగెత్తి అతడు వుద్యోగం గురించి ఆలోచించడం మానుకున్నాడు.

"నువ్వే గాడ్‌ఫాదర్!" అన్నాడు సూర్యదేవ్.

"నేనూ ఒప్పుకుంటున్నాను!" అన్నాడు పుష్కరాజు.

"ఐ అగ్రీ," అన్నాడు నిక్సన్.

నిక్సన్ యాంగ్లో యిండియన్ యువకుడు. అతడి వయస్సు యిరవై దాటింది. తెల్లగా, చక్కగా వుంటాడు.

తండ్రి ఎలక్ట్రికల్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బి. ఎ. చదువుతూ నిక్సన్ కాలేజీకి వెళ్ళడం మానేసేడు. అతడికి ఇంగ్లీషు సినిమాలంటే పిచ్చి!

"నువ్వు గాడ్ ఫాదర్‌లా రూపొందగలవు!" అన్నాడు మస్తాన్.

"మీరందరూ నన్ను గాడ్ ఫాదర్ చేసి నా బాధ్యత పెంచారు," అన్నాడు గంగాధర్.

బేరర్ గదిలోకొచ్చి ప్లేట్లను టేబిల్ మీద వాళ్ళ ముందు పెట్టాడు. కొందరు యింకా తాగుతున్న గ్లాసులవైపు చూశాడు. అదోలా కనుబొమ్మల్ని ఎగరేస్తూ బేరర్ బయటకు వెళ్ళాడు.

మరో హాఫ్ బాటిల్ని గంగాధర్ జేబులోంచి తీసి టేబిల్ మీద పెట్టాడు. రమ్! బాటిల్ని తెరిచి నిక్సన్ రమ్‌ను అన్ని గ్లాసుల్లోనూ సమానంగా పోశాడు. నీళ్ళు కలిపి వాళ్ళు తాగడం ప్రారంభించారు.

బేరర్ అమాంతంగా కాబిన్‌లోకి వచ్చాడు.

"సార్, యిక్కడ తాగకూడదు. మేనేజర్కి తెలిస్తే నా వుద్యోగం వూడుతుంది!" అన్నాడతను.

"చెప్పకు!" అన్నాడు గంగాధర్.

"చెప్పకపోతే నన్ను తిడ్తాడు!"

గంగాధర్ ఆతడి చేతిలో ఒకరూపాయి పెట్టాడు.

బేరర్ దాన్ని దాచుకున్నాడు.

"ఖాళీ బుడ్డీలు యిక్కడ వదలకండి. పట్టుకెళ్ళి ఎక్కడేనా పారేయండి," అన్నాడతను.

"డోంట్ బాదర్! నిన్ను కష్టంలో యిరికించం!" గంగాధర్ జవాబిచ్చాడు.

బేరర్ బయటకు కదిలాడు. తలుపు మూసుకుపోయింది.

"ప్రొహిబిషన్!" అని అందరూ పకపక నవ్వారు.

రమ్ తాగడం పూర్తిచేసి వాళ్లు తిండిలో నిమగ్నులయ్యారు. నిక్సన్ ఏదో చెప్తున్నాడు. గంగాధర్ ఆకలితో తింటున్నాడు. తినేటప్పుడు గంగాధర్ యెక్కువగా మాట్లాడడు. ఆ సమయంలో యితర్లు చెప్పేది వింటాడు.

తినడం పూర్తయింది. బేరర్ని పిల్చి, బిల్లు తెప్పించి గంగాధర్ డబ్బు చెల్లించాడు. ఐదుగురూ సిగరెట్లు పీలుస్తూ కూర్చున్నారు.

"మైడియర్ ఫ్రెండ్స్ ఇక్కడనుంచి యెవరిండ్లకు వాళ్ళు వెళ్ళిపోవాలి. రేపు మన సెంటర్లో కలుసుకుందాం. ఒక కొత్త పథకాన్ని గురించి మనం ఆలోచించాలి," అన్నాడు గంగాధర్.

"ఓ.కే. బాస్," అన్నాడు నిక్సన్.

కాబిన్లోంచి అందరూ బయటకు నడిచారు. ఆమీన్ కేఫ్ బయటకొచ్చాక వాళ్ళు విడిపోయారు.

2

సూర్యదేవ్ రెండుసార్లు బి. ఏ. పరీక్షరాసి, ఫెయిలయి చదువు మానుకున్నాడు. అతడి తండ్రికి పదెకరాల భూమి, ఒక పెద్దతోట వున్నాయి.

ప్రొద్దుటే ఎనిమిదింటికి వాళ్ళు తోటలో కలుసుకున్నారు. తోటలో వివిధ రకాల చెట్లు వున్నాయి. తోట మధ్యలో ఒక పాకవుంది. ఐదుగురూ ఆ పాకలో గుమికూడారు. చాపమీద అందరూ కూర్చున్నారు. వాళ్ల సమావేశాలకు అది రహస్య కేంద్రం.

సంవత్సరం క్రితం మొదటిసారిగా వాళ్ళు అక్కడ

కల్సుకున్నారు. గంగాధర్‌ని బాస్‌గా తతిమ్మా నల్గురూ భావించసాగారు.

గంగాధర్ వాళ్ళకు సక్రమంగా శిక్షణ యిచ్చి అనేక దొంగతనాలు జయప్రదంతా చేయించాడు. చేతికొచ్చి నది అతడు అందరికీ సమానంగా పంచేసేవాడు. అందరికీ కావలసిన విస్కీ, రమ్, సిగరెట్ల ఖర్చులకు కొంత మొత్తాన్ని వేరే తీసివుంచేవాడు.

గంగాధర్ పాంట్, శ్లాక్‌లో వున్నాడు. అందరి తోనూ కలిసి మెలిసి వున్నా అతడిని చూస్తే తతిమ్మా నల్గురూ లోలోన భయపడేవారు.

"నేను చెప్పేది వినేముందు మనం డ్రింక్స్ సేవిద్దాం" అన్నాడు గంగాధర్.

ప్లాస్టిక్ బాగ్‌లోంచి ఒక రమ్‌బాటిల్ తీసి చాపమీద పెట్టాడు. సూర్యదేవ్ బయటకు పరిగెత్తాడు. ఐదు నిమిషాల తర్వాత అతడు పాకలోకి తిరిగొచ్చాడు. ఐదు గ్లాసులనూ, కుండలో నీళ్ళనూ తెచ్చాడతను.

నిక్సన్ బాటిల్ తెర్చి గ్లాసుల్లో రమ్ పోసి, నీళ్ళు కలిపాడు. వాళ్ళు గ్లాసులను అందుకున్నారు. "చియర్స్!" అన్నారందరూ.

గంగాధర్ గడగడ రమ్ తాగేసి సిగరెట్ వెలి గించాడు. పొగ వదులూ అందరివైపూ చూశాడు.

"మై డియర్ ఫ్రెండ్స్. ఇంతవరకూ మనం చేసిన దొంగతనాలు బాగా లాభించాయి. పోలీసుల దృష్టిలోకి మనం వెళ్ళలేదు. పెద్దమనుషుల్లా జీవించగల్గుతున్నాం. నిన్న సినిమా చూశాక నాకొక ఆలోచన తట్టింది. దాన్ని గురించి మీకు చెప్తాను. అంతా విని మీ సలహాలు యివ్వండి!"

పార్కులో నిశ్శబ్దంగా వుంది. చల్లటిగాలి వీస్తోంది. అందరూ నాయకుడి వైపే చూస్తున్నారు.

"ఈ పరిసరాల్లో ఎన్నో నగరాలు లేచాయి. అంబేద్కర్‌నగర్, చైతన్యనగర్, రాజానగర్, గణపతినగర్, యిలా ఎన్నో వున్నాయి. ఒక్కొక్క నగర్‌లో కనీసం 100 యిళ్లు పైన వుంటాయి. ఆ యిళ్ళల్లో వుండే వాళ్ళందరూ మధ్య తరగతి కుటుంబీకులు. కంపెనీలిచ్చిన అప్పు డబ్బులతో వాళ్ళు యిళ్లు కట్టించారు. ఈ ప్రాంతంలో పోలీసుస్టేషన్ లేదు. రాత్రిళ్ళు యిక్కడ దొంగతనాలు జరగొచ్చు! ఏ మాత్రం డబ్బు పోయినా యీ ఇళ్ళల్లో వుండేవాళ్ళు చాలా కష్టపడవలసివస్తుంది."

"యూ ఆర్ రైట్," అన్నాడు నిక్సన్.

"ఈ నగరాల్లోని ప్రతి యింటికీ మనం రక్షణ యిస్తాం. దొంగలు యిళ్ళలో పడకుండా మనం చూస్తాం. ప్రతి యింటి యజమానీ నెలకు మనకు యిరవై రూపాయలు చెల్లించాలి! ఈ నగరాల్లో వెయ్యి యిళ్ళుంటాయి. మనకు నెలకు యిరవై వేలు ఆదాయం వస్తుంది!"

ఇరవై వేలు! అందరూ వుద్రేకంతో గంగాధర్ వైపు చూశారు. గొప్ప స్కీము!

"కాని అందరూ యిస్తారా?" అడిగాడు పుష్కరాజు అనుమానంగా.

"ఇవ్వకపోతే వాళ్ళ ఖర్మ! ఇవ్వని వాళ్ళ యిళ్లల్లో దొంగలు పడ్తారు!"

"గుడ్ ఐడియా! మనమే ఆ దొంగలం!" అన్నాడు నిక్సన్.

"మనం ప్రతియింటికీ వెళ్ళి అడుగుదాం. కొందరు

వెంటనే సమ్మతిస్తారు. కొంతమంది ఆలోచించి చెప్తామంటారు. మరికొందరు మన స్కీమ్‌లో చేరడానికి అంగీకరించకపోవచ్చు! వెంటనే డబ్బు చెల్లించినవారి ఇళ్ళకు రక్షణ వుండేట్లు చూద్దాం."

"రాత్రిళ్ళు మనం కాపలా వుండాలి," అన్నాడు మసాన్.

"దేశంలో వుద్యోగాలు లేని యువకులు యెందరో వున్నారు. నెలకు 100 రూపాయలు జీతం మీద యాభై మంది యువకులను నియమించుతాం. ఈ నగరాల్లో వాళ్లు రాత్రిళ్ళు గస్తీ తిరుగుతూ వుంటారు."

"చాలా బాగుంది. మనం నెగ్గుతాం," అన్నాడు సూర్యదేవ్.

మళ్ళా గ్లాసుల్లో రమ్ పోయమని గంగాధర్ సౌజ్ఞ చేశాడు. నిక్సన్ రమ్‌పోసి, నీళ్ళు కలిపాడు. తన గ్లాసులోని రమ్‌ని గంగాధర్ వేగంగా తాగేశాడు.

నవ్వుతూ వాళ్ళ వైపు చూశాడు.

"ఈ స్కీమ్ జయిస్తే మనం ఒక యింటిని అద్దెకు తీసుకుందాం. ఇటుపైన అక్కడే మనం కల్సుకోవచ్చు!"

"ఫయిన్!" అన్నాడు నిక్సన్.

"ముందుగా మనం కొంతపని చెయ్యాలి. ఇక్కడున్న నగరాలకు మనం వెళ్ళి వీధుల పేర్లూ, యింటి నెంబర్లూ రాసుకురావాలి. ఆటుపైన మనం యింటి యజమానుల్ని కల్సుకోవచ్చు."

"వెంటనే పని ప్రారంభించుదాం," అన్నాడు సూర్యదేవ్.

"మనం జయిస్తాం!" అన్నాడు గంగాధర్.

3

రిజర్వ్ బ్యాంకి ఆఫీసరు కేసవన్ గుమ్మం బయట నిలబడివున్న యువకుడివైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"మీతో మాట్లాడాలి!" అన్నాడతను.

"ఏ విషయం? చిరిగిపోయిన నోట్లు ఏమైనా వుంటే తిన్నగా బ్యాంకికి వెళ్ళు!"

చిరిగిపోయిన నోట్లను చుట్టుపక్కల వాళ్ళు అతడికిస్తూ వుంటారు. రిజర్వ్ బ్యాంకిలో వాటిని మార్చి అతడు మంచినోట్లు తెచ్చి యిస్తూ వుంటాడు. సాధారణంగా ఆ పనిమీదే తన కోసం మనుషులు వస్తారని అతడి అనుమానం!

"నా దగ్గర చిరిగిన నోట్లు లేవు!"

"కమిన్!" అన్నాడు కేశవన్.

హాల్లో పేము సోఫాలున్నాయి. కేశవన్ వయస్సు యాభై వుంటుంది. సన్నటి మనిషి. లుంగీ, బనియన్‌తో వున్నాడు.

"మిస్టర్ కూర్చో!"

"నా పేరు గంగాధర్. ఈ గణపతి నగర్ పట్నానికి దూరంగా వుంది. ఇక్కడున్న యిళ్ళకు దొంగల భయం లేకుండా చేయాలనే వుద్దేశంతో మేం ఒక స్కీం పెట్టాం. దానిలో మీరు చేరొచ్చు. నెలకు 20 రూపాయలు మాకు చెల్లించాలి. మీ యింటికి రక్షణ యిచ్చే బాధ్యత మాది," అన్నాడతను శరవేగంగా.

"దొంగల్ని మీరు ఎలా ఆపగలరు?"

"రాత్రిళ్ళు మా మనుషులు గస్తీ తిరుగుతూ వుంటారు."

కేశవన్ సూటిగా గంగాధర్ వంక చూశాడు.

"గణపతి నగర్‌లో ఎంతమంది నీ స్కీములో

చేరారు?"

"యాభైమంది చేరారు. నేను వెళ్ళి అడగవలసిన ఇళ్ళు యింకా చాలా వున్నాయి."

"సులభంగా డబ్బు గడించడానికి మంచిపద్ధతి ఆలోచించావు!" అన్నాడు కేశవన్ బుల్లెట్‌లా.

తన ఐడియా మంచిదని కేశవన్ అన్నందుకు అతడు లోలోపల సంతోషించాడు. కాని తన సంతోషాన్ని పైకి కనబర్చలేదు.

"ఇందులో మా కంపెనీకి ఎక్కువగా మిగలదు సార్. నిరుద్యోగులకు ఉద్యోగం యివ్వాలనే ఉద్దేశంతో యిది చేస్తున్నాం. రాత్రిళ్ళు గస్తీ తిరగడానికి అనేక మంది యువకుల్ని మేం నియమిస్తున్నాం. వసూలయే డబ్బు చాలా మటుకు వాళ్ళ జీతాలకు పోతుంది," అన్నాడతను వినయంగా.

"ప్రతి సంస్థకీ ఖర్చులుంటాయి!" అని కేశవన్ మరో సారి అతడివంక చూశాడు.

"మిస్టర్, నేను గాంధీగారి శిష్యుడిని. ఇంట్లో దొంగలు పడ్తారనే భయం నాకు లేదు. దొంగలు పడ్డా మా ఇంట్లో ఏముంది పట్టుకుపోడానికి? నీ స్కీమ్ బాగానేవుంది. కాని అందులో నేను చేరలేను!"

గంగాధర్ నవ్వుతూ అతడి వైపు చూశాడు.

"ఇంట్లో పోటానికి ఏముందిలే అని అనేక మంది అనుకుంటారు. ఈ రోజుల్లో వస్తువు విలువ యెక్కువ, డబ్బు విలువ తక్కువ. స్టెయిన్‌లెస్ స్టీల్ కంచాలూ, తదితర పాత్రలూ దొంగలు ఎత్తుకుపోతే మీకు వేలమీద నష్టముంటుంది. ఈ పరిసరాల్లో దొంగతనాలు మహా జరుగుతాయి!"

"నాతో వాదించి లాభంలేదు. పక్క యింటికి వెళ్ళి మాట్లాడితే నీకు మరో మెంబరు దొరకొచ్చు!"

గంగాధర్ పేపరు సోఫాలోంచి లేచాడు.

"కొన్ని నిమిషాలపాటు నాతో మాట్లాడినందుకు మీకు నా థాంక్స్. మా కంపెనీ కార్డు మీ దగ్గర వుంచండి. తర్వాత మా స్కీమ్‌లో మీరు చేరదలిస్తే మాకు ఫోన్ చేయండి. వెంటనే మా మనిషి మిమ్మల్ని కల్సుకుంటాడు" అని ఒక కార్డును అతడికిచ్చాడు.

కేశవన్ కార్డును చూసి, టేబుల్ మీద పడేశాడు. గంగాధర్ బయటకు వెళ్ళాడు. వీధిలో నిలబడి కేశవన్ యింటివైపు చూశాడు.

చిన్న డాబా యిల్లు. అందంగా కట్టబడింది. డాబా పైనున్న టి.వి. యాంటినా మీదకు అతడి చూపు వెళ్ళింది.

కేశవన్‌కి టి.వి. వుంది. అతడు పేదవాడు కాదు. పిసినారై వుండాలి! ఆలోచిస్తూ గంగాధర్ వేగంగా నడవసాగాడు.

వీధి చివర తను ఆపిన స్కూటర్ దగ్గరకు చేరుకున్నాడు. స్కూటర్ని స్టార్ట్ జేసి పోనిచ్చాడు.

స్కూటర్ రోడ్డమ్మట మూసుకుపోతోంది. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. తను అనుకున్నట్లు వెయ్యిమంది మెంబర్లు కావాలి! అంతవరకూ తను నిర్విరామంగా పాటుపడాలి.

రాజానగర్‌లోని గుడిముందు అతడు స్కూటర్ ఆపి, సిగరెట్ పీలుస్తూ చెట్టునీడన నిలబడ్డాడు.

ఐదు నిమిషాల తర్వాత అతడివైపు నిక్సన్ గబగబా వచ్చాడు. నిక్సన్ కళ్ళు మెరుస్తున్నాయి.

"ఇక్కడెలా వుంది?" అడిగాడు గంగాధర్.

"ఆల్ సక్సెస్! ఇరవైమంది మెంబర్లుగా చేరారు. వద్దన్నవాడు కనపడలేదు!"

"ఫయిన్!"

స్కూటర్ స్టార్ట్ చేసి గంగాధర్ కూర్చున్నాడు. అతడి వెనకవే నిక్సన్ చోటు చేసుకున్నాడు. స్కూటర్ రోడ్డమ్మట దూసుకుపోయింది.

4

శ్రీనివాస నగర్‌లో ఒక మేడను గంగాధర్ అద్దెకు దీసుకున్నాడు. కొత్తగా నిర్మించిన మేడ. ఇంటిచుట్టూ ప్రహరీగోడ వుంది. ఇల్లు కట్టించిన వ్యక్తి ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు.

ప్రహరీగోడ మీద ఎత్తుగా పెదబోర్డును గంగాధర్ పెట్టించాడు. హోమ్ సెక్యూరిటీ సర్వీసెస్ అని పెద్ద అక్షరాల్లో బోర్డుమీద చిత్రించబడివుంది.

మేడమీద హాలు పక్కనే విశాలమైన మరో గది, బాత్‌రూమ్, లావట్రీ వగైరా వున్నాయి. నూతినీళ్ళు ఓవర్ హెడ్‌టాంక్ నుంచి కావలసిన చోట్లకు సప్లయి చేయబడుతున్నాయి:

మేడమీద హాల్లో కుషను కుర్చీలో గంగాధర్ కూర్చుని వున్నాడు. పైన ఫాన్ తిరుగుతోంది. అతడి ముందు గాడ్‌రేజ్ స్టీల్ టేబిల్ వుంది. అతడి కెదురుగా నాలుగు కుర్చీల్లో మస్తాన్, నిక్సన్, సూర్యదేవ్, పుష్కరాజు ఆసీనులై వున్నారు.

తళతళ మెరుస్తోంది మొజెయిక్ ఫ్లోర్. గంగాధర్ వాళ్ళవైపు నవ్వుతూ చూశాడు.

"మైడియర్ ఫ్రెండ్స్. విస్కీతో మన సమావేశం

ప్రారంభించుదాం" అన్నాడతను.

మెక్‌డోవెల్స్ విస్కీ బాటిల్ని నిక్సన్ తెచ్చాడు. సూర్యదేవ్ ఐదు గ్లాసులను టేబుల్ మీద వుంచాడు. వాటిలో విస్కీ పోసి, సోడా కలిపాడు నిక్సన్. అందరూ గ్లాసులను అందుకున్నారు.

తన గ్లాసులోని విస్కీని గంగాధర్ గడగడ తాగేశాడు. కింగ్ సైజ్ ఫిల్టర్ సిగరెట్ వెలిగించి వాళ్ళ వంక చూశాడు.

"కామ్రేడ్స్, తోటలోని పాకనుంచి నెలరోజుల్లో మనం చాలాదూరం ప్రయాణం చేశాము. ఇప్పటివరకూ ఐదువందల మంది మన స్కీములో చేరారు. పదివేలు మన చేతికొచ్చింది. ప్రతి నెలా పదివేల రూపాయలు మనకు వస్తుంది. ఇంకా 500 పైన ఇళ్ళు యీ వివిధ నగరాల్లోనూ వున్నాయి. కొందరు మేం చేరమని ముక్కుసూటిగా చెప్పేశారు. మరికొందరు ఆలోచిస్తున్నారు. ఎన్నిసార్లు వెళ్ళినా కొన్నియిళ్ళ యజమానులు మనకు దొరకలేదు. అదీ పరిస్థితి."

గదిలో కొంతసేపు నిశ్శబ్దంగావుంది. టేబుల్ మీద వున్న ఫోన్ మ్రోగింది. గంగాధర్ రిసీవరెత్తి మాట్లాడాడు. రిసీవర్ని పెట్టేసి సూర్యదేవ్ వంక చూశాడు.

"నటేశ ముదలియార్, నంబర్ 10, లక్ష్మీనగర్ మెంబర్‌గా చేరటానికి నిశ్చయించుకున్నాడు. రేపు పొద్దుట నువ్వెళ్ళి మన ఫారంమీద సంతకం పెట్టించి, ఒకమాసం డబ్బు అడ్వాన్స్‌గా వసూలు చెయ్యి!" గంగాధర్ అన్నాడు.

"అలాగే, బాస్."

గంగాధర్ ఆలోచిస్తూ పొగ పైకి వదిలాడు.

"మొదట్లో అతడు మెంబర్‌గా చేరనన్నాడు. మొన్న రాత్రి అతని సైకిల్ పోయినందువల్ల మెంబర్‌గా చేరాలనే వుద్దేశం అతడి కొచ్చివుంటుంది. తన సైకిల్ దొంగతనం గురించి అతడు నీతో చెప్తాడు. సైకిల్ దొంగ కోసం వెతుకుతామని చెప్పు. రెండురోజుల తరువాత సైకిల్‌ని అతడికి పట్టుకెళ్ళి ఇచ్చేయి. పరుషవాకంలో సైకిల్ అమ్మబోతుండగా దొంగను పట్టుకున్నట్లు చిత్రించు. దొంగ పారిపోయాడని చెప్పు! తన సైకిల్ తిరిగివచ్చినందుకు నటేశముదలియార్ చాలా సంతోషిస్తాడు."

"అంతా నేను చూసుకుంటాను," అన్నాడు సూర్యదేవ్.

గంగాధర్ చూపు పుష్కరాజు మీదకి వెళ్లింది.

"మెంబర్లు అవడానికి నిరాకరించినవారి లిస్టు తయారు చేశావా?"

పుష్కరాజు ఒక పత్రాన్ని టేబిల్ మీద వుంచాడు.

"అందులో 120 మంది పేర్లు వున్నాయి" అన్నాడు పుష్కరాజు.

విస్కీని నిక్సన్ ఐదు గ్లాసుల్లోనూ మళ్ళా పోసి, సోడా కలిపాడు. గంగాధర్ తన గ్లాసును అందుకొని విస్కీ తాగేశాడు.

"మైడియర్ ఫ్రెండ్స్, ఆ లిస్టులోని వాళ్ళు త్వరలో మెంబర్లు అయేటట్లు మనం చూడాలి. ఇనపకడ్డీ వంచితే వంగదు. దాన్ని కొలిమిలో పడేసి, బాగా వేడిచేశాక అదే వంగుతుంది. కొందరు మనుషులు కూడా అలాగే వుంటారు."

అందరూ గంగాధర్ వైపు మౌనంగా చూశారు.

"ఇంతవరకూ మనం ఎంతమంది యువకులకు ఉద్యోగాలు

యిచ్చాం?"

"ఇరవై మందికి," అన్నాడు మస్తాన్.

"రాత్రి తొమ్మిదినుంచి పొద్దుటదాకా వాళ్ళు గస్తీ తిరగాలి. వాళ్ళు ఏం చేస్తున్నదీ మనం వెళ్లి రహస్యంగా గమనించాలి. మన కార్యక్రమాలు గురించి వాళ్ళకు యే మాత్రం ఎన్నడూ తెలియకూడదు!" అన్నాడు గంగాధర్.

"వాళ్ల గురించి మనకు బెంగలేదు," అన్నాడు మస్తాన్.

"ఆ లిస్టులోవున్న వాళ్ల గురించి మనం తీవ్రంగా కృషి చేయాలి. మన స్కీములో చేరనివాళ్లు యీ పరిసరాల్లో నివసించడం కష్టమని తెల్సుకోవాలి. అందుకేం చేస్తే బాగుంటుందో మనం ఆలోచించాలి. మనం చేసేది ఒకే విధానంలో వుండకూడదు. అలావుంటే మన్ని వాళ్ళు అనుమానిస్తారు. అనేక విధాల ప్రయత్నించి మనం వాళ్లను లొంగదీయాలి!"

"యూ ఆర్ రైట్! మన పద్ధతుల్లో వెరైటీవుండాలి. అప్పుడే సక్సెస్!" అన్నాడు నిక్సన్.

5

పద్మావతి బట్టల్ని జాగ్రత్తగా డెట్ సోప్ పౌడర్లో వులికి, ఇంటి వెనుకనున్న నైలాన్ తాళ్ళమీద ఆరేసింది. గాలికి ఎగిరిపోకుండా వాటికి క్లిప్పులు పెట్టింది.

పనిమనిషి వెళ్లిపోయాక ఆమె ఒంటరిగా భోజనం చేసి పడగ్గదిలోకివెళ్లి పరుపుమీద వాలింది. వేసవికాలపు ఎండలు! వేడిగాలి కిటికీలోంచి గదిలో కొస్తోంది.

ఆమె ఫాన్ వైపు చూసింది. ఫాన్ వేసుకుంటే చల్లటిగాలి రావచ్చు. కాని ఎలక్ట్రిసిటీ బిల్లు యెక్కువ

అవుతోంది. గతమాసంలో వచ్చిన ఇరవై రూపాయల బిల్లుచూసి భర్త రెండురోజులు తిండి మానేశాడు. అది అంతా గుర్తుకు తెచ్చుకుంటూ ఆమె నిద్రపోయింది.

సాయంత్రం పాలమనిషి వచ్చి పిల్చినదాకా ఆమెకు మెలకువ రాలేదు. ఆమెలేచి పాలుతీసుకుంది. చన్నీళ్లతో మొహం కడుక్కొని వెనకవైపుకు వెళ్లింది. బోసిగావున్న నైలాన్ తాళ్లనుచూసి ఆమె తృళ్ళిపడింది.

తను ఆరేసిన బట్టలు మటుమాయం అయ్యాయి. చీరలు పాంట్లు, చొక్కాలు, జాకెట్లు! ఆమె కొంతసేపు చలనము లేకుండా వుండిపోయింది.

కళ్ళు తుడుచుకుని మళ్ళీచూసింది. నేలమీద ఒక బనియన్, రెండు జేబురుమాళ్లు పడివున్నాయి. ఆమె వాటిని ఆత్రంగా అందుకొంది. తతిమ్మా వాటికోసం అన్నివైపులా తిరిగి చూసింది.

నూతిపక్కనే ఆమె ఆగింది. ఎవరో దొంగిలించి పట్టుకుపోయారు. అన్ని గుడ్డలను ఒక్కసారి కొనాలంటే కనీసం ఐదారు వందలు ఖర్చవుతుంది.

ఆమె పడగ్గదిలోకి వెళ్లి ఏడుస్తూ కూర్చుంది. భర్త యింటికి రాగానే తనకు చీవాట్లూ, దెబ్బలు తప్పవు! ఆమె భర్తకు కోపం ఎక్కువ.

"విలువయిన బట్టలు బయట ఆరేసి, నేలకూలిన అరటి బొందలా పడుకున్నావా, పాపిష్టిముండా!" అని భర్త తిడ్తాడు.

సాధారణంగా భర్త వుపయోగించే తిట్లు పదాలన్నీ ఆమె చెవుల్లో మ్రోగుతున్నాయి. విచారంలో కృంగిపోయిన పద్మావతి కాఫీగురించి పూర్తిగా మర్చిపోయింది.

సరిగ్గా ఆరింటికి ఆమె భర్త కేశవరావు గబగబా

లోపలకొచ్చాడు. పడగ్గదిలోకి వెళ్ళి ఆమెవైపు చూసేడు.

"ఏమయిందే? కన్నీళ్ళలో ఈదుతున్నావు!" అన్నాడతను.

ఆమె వెక్కి వెక్కి ఏడ్వసాగింది. మంచం మీద కూర్చుని అతడామెవంక చిరాకుగా చూశాడు,

"మీ నాన్న పోయారని ఉత్తరమొచ్చిందా?" అడిగాడు.

"నాన్న బతికే వున్నాడు!"

"అయితే ఎవరు చచ్చారు?"

"నేను ఆరేసిన బట్టల్ని ఎవరో ఎత్తుకుపోయారు," అని ఆమె ఏడ్వసాగింది.

"నువ్వు చూస్తూ వూరుకున్నావా?"

"ఎండవేడికి నాకు నిద్ర పట్టేసిందండి. ఎవరు పట్టుకుపోయారో నాకు తెలియదు," అందామె.

కేశవరావు ఆమె తలమీద రెండుసార్లు మొట్టి, గట్టిగా జుత్తు పట్టుకున్నాడు.

"పందిలా తిని, వూరగాయి జాడీలా నిద్రపోతే దొంగలు రాకుండా వుంటారా, గాడిద ముండా! నిన్ను చంపినా పాపంలేదు!"

చేతో అనేక చోట్ల ఆమెను కొట్టసాగాడతను. "రేపు ఆఫీసుకి ఎలా వెళ్ళనే! ఈ మురికి గుడ్డల్లోనే వెళ్ళాలా!" అరుస్తూ అతడామెను వాయిస్తున్నాడు.

"నాకు బుద్ధివచ్చింది. ఇంకెప్పుడూ నిద్రపోను. నన్ను మన్నించండి," బ్రతిమాలిందామె.

అతను వెనక్కి పరుగెత్తాడు. నైలాన్ తాళ్ళవైపు చూశాడు. వెనుదిరిగి వంటగదిలోకి వెళ్ళాడు. పాల చుక్కలు నేలమీదున్నాయి. పాత్ర పక్కకు పడివుంది.

పిల్లి తటాలున కిటికీలోంచి బయటకు దూకింది.

అతడు వ్యగ్రుడై పడగ్గదిలోకి వెళ్ళాడు.

"పాలది పాలు పోసిందా?"

"పాలు వంటగదిలో పెట్టాను," అందామె.

"గుడ్డల్ని దొంగలెత్తుకుపోతే పాలను పిల్లి తాగేసింది. నీలాంటి గాడ్దుముండని పెళ్ళాడం నా తప్పులే!" అని వూరుకున్నాడతను, పక్కింటి ఆచారి తనవైపు చూడ్డం గమనించి.

ఇంతకుముందు ఎన్నిసార్లో కేశవరావు భార్యను కొడుతుంటే ఆచారి జోక్యం చేసుకొని అతడిని మందలించేడు.

"కేశవరావు, నువ్వు చిన్నవాడివి. ఆడదాన్ని ఎన్నడూ కొట్టకూడదు. మనిషై పుట్టాక యేదో తప్పు చేస్తూ వుంటాం. తప్పును సరిదిద్దుకోవమ్మ్చు" అని లెక్చర్ ఇస్తూవుంటాడు ఆచారి.

ఎవరో బయటనించి పిలవడం విని కేశవరావు వీధి గుమ్మంవైపు వెళ్ళాడు. అక్కడ నిలబడిన వ్యక్తివైపు అతడు ఆశ్చర్యంగా చూశాడు. అతడిచేతిలో యెన్నో గుడ్డలున్నాయి.

"ఇవన్నీ మీవేనా?" అడిగాడు మస్తాన్.

"మావే! నీకెలా దొరికాయి?" అడిగాడు కేశవరావు.

"మేం యీ ప్రాంతాల్లో తిరుగుతూ వుంటాం. మా కంపెనీ పేరు మీరు వినేవుంటారు, హోమ్ సెక్యూరిటి సర్వీసెస్."

"విన్నాను. ఇంతకీ ఏమైందో చెప్పు!"

"ఒక పన్నెండేళ్ళ కుర్రాడు యీ బట్టల్ని పట్టుకొని రైలు పట్టాలమ్మట పోతున్నాడు. అనుమానం వచ్చి వాడిని ఆపి, రెండు దెబ్బలేశాక, నిజం చెప్పాడు. అవి

పట్టుకొని యిలా వచ్చాను."

"వాడిని పోలీసులకు అప్పగించావా?"

మస్తాన్ నవ్వాడు.

"వాడిని పోలీసులకు అప్పగిస్తే నాకొచ్చే మెప్పును వాళ్ళు కొట్టేస్తారు. ఆ కుర్రాడిని చితకబాది వదిలేశాను. మళ్ళా యిటువైపు రాడు!" అన్నాడు మస్తాన్.

"మిస్టర్, నువ్వు చేసిన సేవకు నా ధన్యవాదాలు," అని కేశవరావు భార్యవైపు తిరిగాడు.

"అన్నీ వున్నాయో లేవో చూడవే!"

పద్మావతి అన్నిటినీ చూసింది.

"అన్నీ వున్నాయండీ. దేవుడిలా పట్టుకొచ్చి ఇచ్చాడు," అందామె.

అతడు భార్యవైపు చురచుర చూసాడు.

"పక్కింట్లో కొంచెం పాలు తీసుకుని మా యిద్దరికీ కొంచెం కాఫీ పొయ్యి! అంత సేవ చేసిన వాడిని కాఫీ యేనా యివ్వకుండా వెళ్ళమంటే బాగోదు!"

"ప్లీజ్, కాఫీ నాకు వద్దండీ. నా డ్యూటీ నేను చేశాను. నాకు మీరు ఏమీ ఇవ్వనక్కరలేదు."

కేశవరావు నవ్వుతూ అతడివంక చూశాడు.

"ఆ మధ్య మీ కంపెనీ మనిషివచ్చి నన్ను మెంబరుగా చేరమన్నాడు. అతడు మళ్ళా రాలేదు!"

"మళ్ళా అతడిని రమ్మంటూరా?"

"అదే నా వుద్దేశం. మెంబర్ గా చేర్తాను. అతడిని ఇక్కడకు రమ్మను."

"మా కంపెనీ అధికార్లకు చెప్తాను," అని మస్తాన్ సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

కేశవరావు వెనక్కు తిరిగాడు.

"ఇవాళ్టికి నల్లకాఫీ తాగేద్దామండి. పాలు అప్పు తీసుకోవలసిన అవసరం వుండదు," అందామె.

"నలుపో, తెలుపో, ఏదో తొందరగా తగలేయి!" అర్భాడతను విసుగ్గా.

6

రత్నపాప కింకా ఐదేళ్ళు నిండలేదు. బంగారం బొమ్మలా వుంటుంది. డాన్ బాస్కోలో యు. కె. జి. చదువుతోంది. ప్రతిరోజూ రిక్షాలో స్కూలుకు వెళ్ళి, సాయంత్రం అదే రిక్షాలో ఆమె ఇంటికి తిరిగివస్తుంది.

రిక్షాలో ఆమెతో మరో పదిమంది స్కూలుపిల్లలు కూడా వుంటారు.

టైమ్ నాలుగు దాటింది. సుమతి తన పాప రాక కోసం ఎదురుచూస్తోంది. అప్పుడామెకు పిడుగులా ఒక విషయం గుర్తొచ్చింది.

"సాయంత్రం నేను రానమ్మా. మీరు ఎల్లి బిడ్డను తెచ్చుకోవాలి," అన్నాడు రిక్షావాడు.

స్కూలు నాలుగింటికి మూసేస్తారు. అక్కడికి నడిచి వెళ్ళడానికి కనీసం యిరవై నిమిషాలు పడుతుంది. ఏం చెయ్యాలో తోచక సుమతి ఇంటిముందు పచార్లు చేస్తోంది.

సైకిల్ మీద పోతున్న రాజా తండ్రిని ఆమె ఆపింది.

"స్కూలుకేనా వెళ్తూంట?" అడిగిందామె.

ఆతడు తలాడించాడు. రాజా, రత్నపాప వొకే స్కూల్లో చదువుతున్నారు.

"మా పాపనుకూడా తీసుకురండి. అక్కడికెళ్ళడానికి ఎవ్వరూ లేరు," అందామె.

"అలాగే," అని రాజా తండ్రి సైకిల్ని వేగంగా తొక్కుకు పోయాడు.

రాజా తండ్రి సైకిల్ కోసం ఎదురుచూస్తూ సుమతి ఇంటిముందు పచార్లు చేస్తోంది.

పదిహేను నిమిషాల తర్వాత రాజా తండ్రి సైకిల్ తిరిగి వచ్చింది. ముందు సీటుమీద రాజా కూర్చునువ్నాడు. "మీ పాప అక్కడలేదు. ఎవరితోనో ఆమె వెళ్ళిపోయి వుంటుంది. కాస్సేపట్లో ఇంటికి రావచ్చు," అని రాజా తండ్రి సైకిల్ తొక్కుకుపోయాడు.

సుమతికి పిచ్చి పట్టినట్లయింది. రత్న పాపను యెవరు తీసుకెళ్ళి వుంటారు? ఎవరు తీసుకువెళ్ళినా యీ పాటికి తీసుకొచ్చి యింట్లో దింపేయాలిగా?

సుమతి, ఆమె అత్త స్కూలుకు వెళ్ళారు. స్కూలు మూసేసివుంది. అక్కడ ఎవ్వరూ లేరు. అనేకచోట్ల వెతుకుతూ వాళ్ళిద్దరూ యింటికి తిరిగి వచ్చారు.

సుమతి, ఆమె అత్త ఇంటిముందు నచ్చుమీద అలస టతో కూర్చుండిపోయారు. ఇంతలో సుమతి భర్త రామన్ సైకిల్ దిగాడు.

"స్కూలునుంచి పాపయింకా రాలేదండీ!" అంది సుమతి.

"వెళ్ళి చూడనా?" అడిగాడు రామన్.

"మేంవెళ్ళి చూసొచ్చాం. రత్నపాప అక్కడలేదు" అంది అతడి తల్లి.

రామన్ స్వతహా భయస్థుడు. గాభరాగా భార్య వైపు చూశాడు.

"సుమతీ, మన పాప ఏమై వుంటుంది?"

"భయపడకండి. మనకు తెలిసినవాళ్ళెవరో దాన్ని యింటికి తీసుకెళ్ళి వుంటారు. కాస్సేపట్లో దాన్ని మనకు

అప్పగిస్తారు," అంది సుమతి.

భర్తను భయపెట్టడం ఆమె కిష్టంలేదు. ఈ మధ్యనే అతడు టైఫాయిడ్ జ్వరంతో బాధపడి, చచ్చి బ్రతికి మెల్లిగా కోలుకున్నాడు.

"అలా మన స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి చూసివస్తాను," అన్నాడు రామన్.

"నేనూ వస్తాను, పదండి" అని ఆమె వెనుకనున్న కేరేజ్ మీద కూర్చుంది.

ఆయాసపడ్తూ రామన్ సైకిల్ని పోనిచ్చాడు. ఏడెనిమిది ఇళ్ళకు వెళ్ళి వాళ్ళు నిరాశతో తిరిగి వచ్చారు.

"ఎక్కడా లేదా?" అడిగింది తల్లి రామన్ వైపు చూస్తూ.

"లేదు!" అన్నాడతను, తల్లివైపు చూడకుండా.

గచ్చుమీద కూర్చున్న సుమతి కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. రామన్ ఆమెపక్కనే చతికిలపడ్డాడు. ఇరుగు పొరుగువాళ్ళు పరామర్శించడానికి వచ్చే ప్రయత్నంలో వున్నారు.

అదే సమయంలో మెరుపులా ఇంటిముందు స్కూటర్ ఆగింది. దాని మీదనుంచి నవ్వుతూ దిగింది రత్నపాప.

స్కూటర్ దిగిన వ్యక్తి వైపు రామన్ కృతజ్ఞతతో చూశాడు.

"నా పేరు గంగాధర్," అన్నాడతను.

రామన్ అతడితో కరచాలనం చేశాడు.

"ప్లీజ్, లోపలకు రండి," ఆహ్వానించాడు రామన్.

హాల్లోని సోఫాల్లో గంగాధర్, రామన్ కూర్చున్నారు. రత్నపాప బొమ్మతో ఏదో చెప్తోంది.

వచ్చీరాని మాటలు! సుమతి రెండుకప్పుల్లో కాఫీ

తెచ్చి వాళ్ళకిచ్చింది. గంగాధర్ కాఫీతాగి సిగరెట్ పాకెట్ తీశాడు. రామన్‌కి ఒక సిగరెట్ యిచ్చాడు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

"పాపను గురించి మేము చాలా గాభరా పడ్డాం. అది మీకెలా దొరికింది?" అడిగాడు రామన్.

"రిక్షావాడు రాలేదట. ఒంటరిగా రోడ్డమ్మట వెళుతోంది. పాపనుచూసి నేను స్కూటర్ మీద కూర్చోబెట్టుకున్నాను. చాకెట్లు కొనిచ్చాను. చాలాసేపు పాప నోరు తెరిచి మాట్లాడలేదు. నాతో అలవాటైనాక మాట్లాడింది. మీ పేరూ, అడ్రసూ కనుక్కొని వెంటనే ఇక్కడకు తీసుకువచ్చాను," అన్నాడు గంగాధర్.

"చాలా థాంక్స్, మీరు ఏం చేస్తున్నారు?"

"ప్రజాసేవ. నేను హోమ్ సెక్యూరిటీ సర్వీసెస్ అనే కంపెనీ అధిపతిని."

"మీ కంపెనీలో నేను మెంబర్ కావాలి" అన్నాడు రామన్.

"మీరు మెంబర్ కాదా?" అడిగాడు గంగాధర్ ఆశ్చర్యాన్ని ప్రదర్శిస్తూ.

"మీ కంపెనీ మనిషి నన్ను కలుసుకున్నాడు. కాని అప్పట్లో నేను మెంబర్ కాలేకపోయాను."

"డోంట్ బాదర్. రేపు మా మనిషిని పంపుతాను" అని గంగాధర్ లేచాడు.

రత్న పాపను ముద్దెట్టుకొని, గంగాధర్ తన స్కూటర్ మీద వెళ్ళిపోయాడు.

"సుమతీ, చూశావా! ఈ రోజున వాళ్ళ స్కీములో చేరడం వేస్టన్నావు! చివరికి ఆ కంపెనీ అధిపతే మన

బిడ్డను మన కప్పగించి వెళ్ళాడు,'' అన్నాడు రామన్.

"నన్ను చెప్పకండి. వెటనే మెంబరవండి. నేను వద్దన్నానా,'' అంది సుమతి సంతోషంగా.

7

ఉమాపతి కుంటుతూ పోలీస్ స్టేషన్ వైపు అడుగులు వేశాడు. రెండు నెలల క్రితం జరిగినది అతడికి జ్ఞాపికి వస్తోంది.

ఆనాడు ఆదివారం. అతడు స్నేహితుడితో నైట్ షో కెళ్లి ఒంటరిగా అంబేద్కార్ నగర్ లోవున్న తన ఇంటికి వెళుతున్నాడు. సిటీ లిమిట్ దాకా అతడు ఆటోలో వచ్చాడు. అటుపైన యింటివైపు నడవక తప్పలేదు.

రైలుపట్టాల ప్రక్కన ఉమాపతి కదులుతున్నాడు. ఆకాశంలో చంద్రుడు లేడు. చుట్టూ చీకటిగా వుంది. జనసంచారంలేని తోవది.

కొంచెం దూరం వెళ్ళాక ఎదురుగా వస్తున్న మూడు ఆకారాలు అతనికి కనిపించాయి. తను ఒంటరిగా లేనని అతడు మొదట్లో సంతోషించాడు. కాని మరుక్షణంలో అతడి సంతోషం మాయమైపోయింది.

ఎదురుగా వస్తున్నవాళ్ళు అతనికి దగ్గరయ్యారు. అమాంతంగా ఇద్దరు అతడిని పట్టుకున్నారు. మూడో అతడు కత్తితో ఉమాపతిని బెదిరించాడు.

"ఉన్నదంతా మాకిచ్చేసి ఇంటికిపో! లేకపోతే నిన్ను చంపి ఆ నూతిలో పారేస్తాం,'' అన్నాడతను.

సమీపంలో, పట్టాలకు పక్కనే నుయ్యి వుందని అతడికి తెలుసు. ఉమాపతి వణుకుతూ వుండిపోయాడు.

ఎదురుగా వున్నతను ఉమాపతి జేబులు వెతికాడు. ఉన్నదంతా తీసేసుకున్నాడు, నాలుగువందల యిరవై

ఆయిదు రూపాయలు, రిస్ట్ వాచ్, పెన్ వగైరా ఉమాపతి నష్టపోయాడు. అతడి జేబులోవున్న సిగరెట్ కేసును కూడా దొంగ లాక్కున్నాడు.

"ఆ సిగరెట్ కేసు వుంచండి. ఇంత రాత్రివేళ సిగరెట్లు దొరకవు." అని ఉమాపతి బ్రతిమాలాడు.

దొంగ సిగరెట్ కేసును అతడి జేబులో పడేశాడు.

"తొందరగా యింటికి పో! నోరు మూసుకుని పడుకో! పోలీసు రిపోర్టిస్తే నీ తోలు వల్చేస్తాను," అని భయపెట్టాడతను.

వాళ్ళు వెళ్ళిపోయారు. ఉమాపతి యింటికి వెళ్ళలేదు. కిలోమీటర్ దూరంలోవున్న పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి రిపోర్టు యిచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ మురుగన్ వుషారైన వ్యక్తి.

"వాళ్ళను గురించి వర్ణించండి," అన్నాడు యిన్‌స్పెక్టర్.

"వాళ్ళు ముగ్గురూ మాస్కులు ధరించారు. నాతో మాట్లాడిన వ్యక్తి వాళ్ళ నాయకుడై వుండాలి. అతడిది బొంగురు కంఠం. అంతకంటే మరేమీ చెప్పలేను." అన్నాడు ఉమాపతి.

ఇన్‌స్పెక్టర్ మురుగన్ తల పంకించాడు.

"వాళ్ళను పట్టుకోడానికి వుపయోగపడే క్లూ ఏదేనా వుంటే గుర్తు తెచ్చుకోండి!"

ఉమాపతికి డిటెక్టివ్ కథలంటే ఎంతో పిచ్చి. ఆ క్షణంలో జేబులో వున్న సిగరెట్ కేసు అతడికి గుర్తొచ్చింది.

"వాడు నా సిగరెట్ కేసును తీసుకుని మళ్ళీ నా జేబులో పడేశాడు. దానిమీద అతడి వేలిముద్రలు

వుంటాయా?"

ఇన్‌స్పెక్టర్ వుషారుగా పైకి లేచాడు.

"అటువంటి క్లూ కోసమే మేం చూస్తున్నాం. ఆ కేసు మీద వేలిముద్రలు వుంటాయి. దాన్ని రుమాల్తో పట్టుకుని మెల్లిగా టేబుల్ మీద పడేయండి."

ఉమాపతి రుమాల్తో సిగరెట్ కేసును తీసి టేబుల్ మీద పడేశాడు.

"వేలి ముద్రలున్నాయో లేదో మేం చూస్తాం," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

రెండురోజుల తర్వాత ఉమాపతి ఇన్‌స్పెక్టర్ని కల్సుకున్నాడు.

"మీ వేలిముద్రలు కాక మరో వ్యక్తి వేలిముద్రలు ఆ కేసుమీద వున్నాయి. ఆ వేలిముద్రల ద్వారా ఆ దొంగ మాకు తప్పక దొరుకుతాడు," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అప్పటి నుంచీ అప్పుడప్పుడు పోలీస్ స్టేషన్‌కి ఉమాపతి వెళ్ళి ఏదేనా తెలిసిందేమో కనుక్కుంటూ వుంటాడు.

ఇన్‌స్పెక్టర్ మురుగన్ నవ్వుతూ ఉమాపతి వంక చూశాడు.

"మా పరిశోధన పడవ కదల్లేదు. ఉన్నచోటే వుండి పోయింది! ఏదేనా తెలిస్తే మీకు వార్త పంపుతాను," అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అనేకమంది దొంగల వేలిముద్రలు మీ దగ్గర వుంటాయి. వాటితో పోల్చి చూశారా?"

"పోల్చి చూశాం. ఇతడు కొత్త దొంగై వుండాలి. అందువలన అతడెవరో తెల్సుకోడానికి కొంత టైం పడ్తుంది," అన్నాడు యిన్‌స్పెక్టర్.

"వాళ్ళు నన్ను ఆపిన స్థలం పరిసరాల్లో గూండా

లాంటి వాళ్ళు ఎందరో గళ్ళలుంగీలు కట్టుకుని తిరుగుతూ వుంటారు. వాళ్ళ వేలిముద్రలు మీరు తీసుకోవాలి," సలహా యిచ్చాడు ఉమాపతి.

"మీరు తొందరపడకండి. మనిషిలో దొంగగుణం ఏర్పడితే అది పోదు. గాని మూలంగా దొంగ మనకు చిక్కుతాడు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఇన్‌స్పెక్టర్, ఆ నాటి రాత్రి నాకు జరిగినది మరెవ్వరికీ జరగకూడదని నా తాపత్రయం. పోయిన డబ్బు నాకు తిరిగి రావాలని నేను ఆశించడం లేదు. డబ్బును నేను సంపాదించగలను. ప్లీజ్, నా కేసు గురించి మీరు దర్యాప్తు చెయ్యాలి. ఏదో తెల్సినదాకా మీరు వూరుకో కూడదు," అని ఉమాపతి కుర్చీలోంచి లేచాడు.

ఇన్‌స్పెక్టర్ మురుగన్‌కి నమస్కరించి అతడు బయటకు నడిచాడు. సమీపంలోవున్న బస్‌స్టేండు వైపు అతడు అడుగులు వేశాడు. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. పోలీసులు శ్రద్ధతో కృషి చేస్తే దొంగతనాలు తగ్గుతాయి. కాని వాళ్ళు అంతగా శ్రమించరు. ఏదో పొరపాటు చేసి దొంగ వాళ్ళకు చిక్కాలిగాని, వాళ్ళు దొంగను పట్టుకొంటారనే నమ్మకం అతడిలో లేదు!

8

హోమ్ సెక్యూరిటీ సర్వీసెస్ అఖండంగా సాగుతోంది. వెయ్యిమంది పైన మెంబర్లుగా చేరారు. ప్రతినెలా ఇరవై వేలపైన ఆదాయం వస్తోంది.

మెల్లెక్కి పైకి చేరుకున్న గంగాధరంలో వచ్చిన మార్పును తలిమ్మాం నలుగురూ గుర్తించారు. మునపటిలా అతడు తలిమ్మాం నలుగురితో కలిసి తాగడం మానేశాడు. ఆఫీసు మేడమీద ఏర్ కండిషండ్ గదిలో అతను

వుంటాడు. అవసరాన్నిబట్టి తతిమ్మా నలుగురినీ పిల్చి సుకసరిగా మాట్లాడి పంపేస్తాడు. ఒకనాడు వాళ్ళను బంధించిన స్నేహభావం యిప్పుడు లేదు.

గంగాధర్ ఫియట్ కారులో తిరుగుతాడు. తతిమ్మా నల్గురికీ స్కూటర్లు కొనియిచ్చాడు. యీ ఖైమందిని గస్తీ తిరగడానికి అతడు నియమించాడు.

ఐదుగురు మనుషులు నూరు యిళ్ళకు కాపలాగా వుంటారు. మొత్తం యీ ఖైమంది వెయ్యిఇళ్ళకు కాపలాగా వుంటున్నారు.

రొటేటింగ్ కుర్చీలో కూర్చున్న గంగాధర్ సీరియస్‌గా నిక్సన్ వైపు చూశాడు.

"ఆ మాధవయ్యగాడిని మీరు లొంగదీయలేక పోయారు!" అన్నాడు గంగాధర్.

విజయానగర్‌లో మాధవయ్య స్వంత యిల్లు కట్టించుకున్నాడు, కాని అతడు వాళ్ళ స్కీములో చేరలేదు!

"దొంగలా! నా యింట్లో అడుగు పెట్టడానికి దొంగకు ఎన్ని గుండెలుండాలో తెలుసా? ఒకసారి అడుగు పెట్టి చూస్తే వాడికే తెలుస్తుంది!" అన్నాడు మాధవయ్య నిర్లక్ష్యంగా.

"బాస్, మనకు వెయ్యిమంది పైన మెంబర్లు వున్నారుగా! ఒక్క మాధవయ్య లేకపోతే పోయిందేమిటి?" అన్నాడు నిక్సన్.

గ్లాసులోవున్న స్కాచ్ విస్కీని గంగాధర్ గడగడ తాగేశాడు.

"నిక్సన్, నీది మట్టిబుర్ర! నాకు కావలసింది మాధవయ్య యిరవై రూపాయలు కాదు. నన్ను ఒకడు ఎదిరించగలిగాడనే భావం మాధవయ్య పేరు గుర్తుకొచ్చి

నప్పుడల్లా వేధిస్తూవుంటుంది. నీకు రెండురోజులు టైమ్ యిస్తున్నాను. మాధవయ్యను వంచి మన తోవకు ఈడ్చుకు రావాలి!"

"ప్రయిత్నిస్తాను." అన్నాడు నిక్సన్.

"నాకు కావలసింది ప్రయత్నం కాదు, ఫలితం! మాధవయ్యను జాడించలేకపోతే నీకీ సంస్థలో స్థానం లేదు!" అర్చాడు గంగాధర్.

నిక్సన్ కోపంతో లేచాడు.

"బాస్, నువ్వు గతాన్ని మర్చిపోతున్నావు!"

గంగాధర్ పళ్ళు యికిలించాడు.

"గతాన్ని అంటిపెట్టుకుని బ్రతికేవాళ్ళకు భవిష్యత్తు వుండదు!"

నిక్సన్ ఏదో చెప్పాలనుకున్నాడు. కాని ధైర్యం చాలక వూరుకున్నాడు. కాని అతడి మనస్సు విరిగింది. సూటిగా గంగాధర్ వంక చూస్తూ వుండిపోయాడు.

"ఏమిటలా పిచ్చాడిలా చూస్తున్నావు?"

"నీ కొమ్ములు ఎంత పైకి లేచాయో చూస్తున్నాను. నా కిక్కడుండాలనే వుత్సాహం లేదు. ఐయామ్ లీవింగ్!"

గంగాధర్ వ్యంగ్యంగా నవ్వాడు.

"నిక్సన్, యీ సంస్థనుంచి ఎవ్వరూ వెళ్ళిపోలేరు. బతికున్నంత కాలం ఇక్కడ పాటుపడాలి! ఇక్కడనుంచి పోడానికి ఒక్కటే మార్గం—డెత్!"

గాభరాగా చూశాడు నిక్సన్. గంగాధర్ దేవాంతకుడు. అతడిని ఎదిరిస్తే ఏమైనా చేస్తాడు.

"నేను మన రహస్య కార్యక్రమాలను గురించి ఎవ్వరికీ చెప్పనని హామీ యిస్తాను. లెట్ మి గెటవుట్!"

"నేనెవర్నీ నమ్మను!"

గంగాధర్ బజ్జర్ నొక్కాడు. మస్తాన్, సూర్యదేవ్ గదిలోకి పరుగెత్తుకొచ్చాడు.

"వీడిని తీసుకెళ్ళి వెనుక నున్న గదిలో పడేసి తాళం వేయండి. నేను వచ్చి తర్వాత కార్యక్రమం చెప్తాను," గర్జించాడు గంగాధర్.

మస్తాన్, సూర్యదేవ్ అతడిని యిరువైపులా పట్టుకున్నారు.

"కామ్రేడ్స్, మనందరం కలిసి బాస్ మీద పడాలి! వాడు పోతే మనకు శని విరగడవుతుంది!"

గంగాధర్ అతడివైపు కదిలాడు. చేత్తో అతడి చంప మీద బలంగా కొట్టాడు. పెనుతుఫానులో విరిగి పడిన చెట్టులా నిక్సన్ నేలమీద పడిపోయాడు.

"వాడిని గదిలో పడేయండి!" అర్చాడు గంగాధర్.

9

గంగాధర్ గదిలోకి అతడు మెల్లిగా వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. అతడి వయసు యాభై దాటివుంటుంది. పాతకాలపు సూట్‌లో వున్నాడు. బట్టతల.

"నా పేరు విలియమ్స్. మా అబ్బాయి నిక్సన్ రెండు రోజుల నుంచి యింటికి రావడంలేదు. అతడు ఏమైనాడో మీకు తెలుసా?" అడిగాడతను.

"అతడు ఇక్కడకూ రాడంలేదు. లీవ్ లెటర్ కూడా పంపలేదు!" అన్నాడు గంగాధర్.

"పోలీస్ రిపోర్ట్ యివ్వడం మంచిదేమో!"

"మంచిదని తోస్తే వెంటనే ఇవ్వండి!"

స్ప్రింగు తలుపు తోసుకుని సూర్యదేవ్ లోపలకు

వచ్చాడు. దగ్గరగా వెళ్ళి ఏదో చీటీని గంగాధర్‌కి యిచ్చాడు. ఆ చీటీని చదివి అతడు సూర్యదేవ్ వైపు తిరిగాడు.

"అతడు ఎప్పుడు ఫోన్ చేశాడు?"

"ఇప్పుడే, బెంగుళూర్ నుంచి డైరక్ట్ డయిలింగ్ చేసి నాతో మాట్లాడాడు," అన్నాడు సూర్యదేవ్.

"ఇదంతా ఆయనతో చెప్పు!" అన్నాడు గంగాధర్.

సూర్యదేవ్ ఎదురుగావున్న విలియమ్స్ వైపు చూశాడు.

"మీరు నిక్సన్ తండ్రేనా?"

అతడు తలాడించాడు.

"మీ అబ్బాయి నిక్సన్ ఏదో రేప్ కేసులో యిరుకున్నాడట. అతనికోసం పోలీసులు గాలిస్తున్నారు. అతడు బెంగుళూరు పారిపోయాడు. అక్కడి నుంచి మరెక్కడికో పోతాడట! ఈ వార్త మీకు కూడా చెప్పమని అతడు నాకు ఫోన్‌లో చెప్పాడు. పోలీసులు మీ యింటికి వస్తే నిక్సన్ ఎక్కడున్నదీ తెలియదని మిమ్మల్ని చెప్పమన్నాడు" అన్నాడు సూర్యదేవ్.

"గుడ్ గాడ్, వాడిలా పాడైపోతాడని నేననుకో లేదు!" అన్నాడు విలియమ్స్.

"డోంట్ బాదర్! అయిందేదో అయింది. పరిస్థితులు బాగుపడ్డాక అతడు వెనక్కి తిరిగొస్తాడు" అన్నాడు గంగాధర్.

విలియమ్స్ కుర్చీలోంచి లేచాడు.

"ఈ వార్త మరెవ్వరికీ తెలియకుండా దయచేసి చూడండి. ఎంత హీనదశకు వాడు దిగజారినా, నిక్సన్ నా కొడుకే!"

"ఎవ్వరికీ చెప్పం. అతను యిక్కడ పనిచేసేవాడు. మా కంపెనీకి చెడ్డ పేరు రావడం మాకూ మంచిదికాదు," అన్నాడు గంగాధర్.

విలియమ్స్ గదిలోంచి బయటకు వెళ్ళిపోయాడు. స్ప్రింగ్ తలుపు అతడి వెనకనే మూసుకుంది.

"వెల్ డన్, సూర్యదేవ్! నిక్సన్ శవాన్ని ఎక్కడ పడేశారు?"

"కారులో 20 మైళ్ళ దూరం తీసుకెళ్ళి పొదలపక్కన పాతిబెట్టాం. అటువైపు యెవ్వరూ వెళ్ళరు. నో డేంజర్!"

"గుడ్ వర్క్!" అని గంగాధర్ రెండు గ్లాసుల్లో స్కాచ్ విస్కీ పోసి, సోడా కలిపాడు.

"శని విరగడైంది. డ్రింకిట్!" అన్నాడు గంగాధర్.

10

టైమ్ పన్నెండు దాటింది.

అమావాస్య చీకటి. ఏడో వీధి చివర్న వుంది మాధవయ్య యిల్లు. అతడి యిల్లు దాటాక రెండు ఫర్లాంగుల దూరం వరకూ యిళ్ళులేవు. విశాలమైన మైదానం వుంది. ఆ మైదానంగుండా రైలుపట్టాల వైపు పోవచ్చు.

సూర్యదేవ్, మస్తాన్ ఏడో వీధమ్మట రెండుసార్లు తిరిగారు. ఆ ప్రాంతంలో గస్తీ తిరిగే వాళ్ళను మస్తాన్ మరోవైపుకు తరలించాడు. వీధికుక్కలు వాళ్ళిద్దర్నీ చూసి మొరుగుతున్నాయి.

ఇద్దరూ మాధవయ్య యింటిముందు ఆగారు. వెదురు బొంగులతో కట్టిన తలుపు తోసుకుని గోడపక్కనే మెల్లగా అడుగులేస్తూ వెనకవైపు వెళుతున్నారు.

ఇంటి వెనక చిన్నపాకలో ఒక ఆవూ, గేదే వున్నాయి.

ఆ పాకవైపు యిద్దరూ వెళుతున్నారు.

అమాంతంగా కుక్క మొరిగింది. సూర్యదేవ్ చూసే లోపల కుక్క అతడి కాలును కర్చి పట్టుకుని పళ్ళను లోతుగా దిగేసింది.

సూర్యదేవ్ దాన్ని చేత్తో బాదాడు కాని కుక్క పట్టు వదలేదు. మస్తాన్ కుక్క మెడను తన రెండు చేతుల్లోనూ బిగించి గట్టిగా నొక్కసాగాడు. కుక్క నోట్లోంచి సూర్యదేవ్ కాలు బయటపడింది. కుక్క బాధతో అరుస్తోంది.

"నువ్వు ఆవును బయటకు తోలుకుపో!" అన్నాడు మస్తాన్.

సూర్యదేవ్ పాకలోవున్న ఆవును విప్పి బయటకు తోలుకుపోయాడు.

కుక్క మెడను మస్తాన్ యింకా నొక్కుతూనే వున్నాడు కాని అది అంత సులువుగా చచ్చేటట్టులేదు.

సూర్యదేవ్ ఆవును మైదానంవైపు తోలుకుపోయాడు. కుక్కను వదిలి మస్తాన్ ముందువైపుకు పరిగెత్తాడు. అప్పుడే బయటకొచ్చిన మాధవయ్య అతడి కెదురుగా ప్రత్యక్షమయ్యాడు.

మాధవయ్య ఆజానుబాహుడు. కండలు తిరిగిన శరీరం. వయస్సు యాభై దాటినా అతడి బలం తగ్గలేదు.

ముళ్ళతీగల పైనుంచి మస్తాన్ దూకబోయాడు. మాధవయ్య అతడి తలమీద యినుపకడ్డీతో కొట్టాడు. మస్తాన్ కింద పడిపోయాడు.

మాధవయ్య బయటకు పరుగెత్తి మైదానం వైపు చూశాడు. దూరంలో తెల్లటి ఆవు అతడికి అస్పష్టంగా అగుపించింది. అతడు అటువైపు చిరుతపులిలా పరిగెత్తాడు.

తనవైపు వస్తూన్న వ్యక్తి మస్తాన్ కాదని సూర్యదేవ్ కనిపెట్టాడు. పాంటు జేబులోవున్న కత్తిని పైకి తీశాడు.

మాధవయ్య యినపకడ్డీతో సూర్యదేవ్ వైపుకొట్టేడు. అతడు అమాంతంగా వెనక్కు జరిగాడు. అతడికి తగల వలసిన దెబ్బ నేలకు తగిలింది. అదే క్షణంలో సూర్యదేవ్ కత్తిని మాధవయ్య గుండెల్లోకి దిగేశాడు.

క్షణకాలం ఇటూఅటూ తూలూ మాధవయ్య అమాంతంగా కిందపడ్డాడు. అతడి చావుకేక గాలిలో భయంకరంగా ధ్వనించింది.

ఆ కేక విని మస్తాన్ మేలుకున్నాడు. లేచినుంచున్నాడు. మైదానంవైపు కదిలాడు. తలనుంచి యిప్పుడు రక్తం కారడంలేదు.

సూర్యదేవ్ గబగబ మస్తాన్ దగ్గరకు వచ్చాడు.

"వాడిని చంపవలసి వచ్చింది!"

"చావనీ, గాడిద కొడుకుని!" అన్నాడు మస్తాన్.

ఆ వీధిలోని ఇళ్ళలోని వాళ్ళు కిటికీల్లోంచి బయటకు చూస్తున్నారు. తలుపు తెరిచి వీధిలోకొచ్చే ధైర్యం ఎవరికీ లేదు.

"అవును ఏం చేద్దాం?"

"దాన్ని ఇక్కడే వదిలేసి పారిపోదాం," అన్నాడు మస్తాన్.

ఇద్దరూ వేగంగా రైలు పట్టాలవైపు పరిగెత్తారు. పట్టాలు దాటి అటువైపుకు వెళ్ళి వినాయకనగర్ చేరుకున్నారు.

ఫియట్ కారులో కూర్చుని గంగాధరం వాళ్ళకోసం ఎదురు చూస్తున్నాడు. వాళ్ళు దగ్గరవగానే అతడు వెనక తలుపు తెరిచాడు. వాళ్ళు ఎక్కాక తలుపుమూసి

గంగాధర్ కారును పోనిచ్చాడు.

"ఆవును ఎక్కడ దాచారు?"

"వదిలేశాం!" అన్నాడు మస్తాన్.

"యూ ఫూల్స్!" అర్చాడు గంగాధర్.

"మాధవయ్యను చంపవలసి వచ్చింది."

"అతడిని ఎందుకు చంపారు?"

"అతడిని చంపకపోతే మేం అతడిచేతుల్లో చావవలసి వచ్చేది," అన్నాడు మస్తాన్.

"నా ప్లాన్ని మీరు సర్వనాశనం చేశారు!" అన్నాడు గంగాధర్.

"బాస్, ఆ పరిస్థితుల్లో నువ్వూ మాలాగే చేసుండే వాడవు!" అన్నాడు మస్తాన్.

"షటప్, యూ బ్లడీ పిగ్!" అర్చాడు గంగాధర్.

11

కారులో కూర్చున్న గంగాధర్ గ్లాసులో విస్కీ పోసుకుని గడగడ తాగేశాడు. టైమ్ చూశాడు. ఒంటిగంట కావస్తోంది.

సిగరెట్ పొగవదుల్తూ అతడు సమీపంలో వున్న పొదలవైపు చూశాడు. కాస్సేపట్లో పుష్కరాజు కారు దగ్గరకొచ్చాడు. పారను డిక్కీలో పెట్టి మూశాడు. మెల్లిగా వెళ్ళి ముందు సీటుమీద కూర్చున్నాడు. స్కాచ్ విస్కీ పోసిన గ్లాసును గంగాధర్ అతడికి అందించాడు.

"మైడియర్ ఫ్రెండ్, డ్రింకిట్!" అన్నాడతను.

పుష్కరాజు గడగడ తాగేశాడు.

"ఇటుపైన నువ్వు నా కుడిభుజానివి! వాళ్ళు పోవడం మూలంగా నీవాటా పెరుగుతుంది! బి హేపీ!" అన్నాడు గంగాధర్.

"ఇదంతా నాకు సంతోషంగా లేదు. వాళ్ళు మన మిత్రులు. మనతో పాటుపడ్డారు. ఈనాడు వాళ్ళను వీధి కుక్కల్లా చంపి పాతేశాం! ఇది న్యాయం కాదు," అన్నాడు పుష్కరాజు.

"వాళ్ళు బ్రతికుంటే మాధవయ్య హత్యలో యిరుక్కుంటారు. వాళ్ళ మూలంగా మనకూ ప్రమాదం వస్తుంది. మన ప్రాణాలను కాపాడుకోడంకోసం వాళ్ళని చంపవలసి వచ్చింది. ఆవును తోలుకు రమ్మంటే మాధవయ్యను వాళ్ళు చంపి వచ్చారు. తప్పెవరిది? వాళ్ళదా? మనదా?" అడిగాడు గంగాధర్.

విస్కీ గ్లాసును పుష్కరాజుకు యిచ్చాడు. అతడు మరో పెగ్ వేగంగా సేవించాడు. ఇప్పుడు హుషారుగా వుంది. తను పాతిపెట్టిన మిత్రుల్ని మరచిపోయాడు.

"యూ ఆర్ రైట్ బాస్," అన్నాడతను.

"ఈ సంపదకోసం ఎక్కువ పాటుబడింది నువ్వూ, నేనూ. వాళ్ళు కాదు. ఇప్పుడు మనం అఖండంగా జీవించవచ్చు. డబ్బుకు కొరత వుండదు. హోటల్ మెట్రోని త్వరలో మనం కొందాం. మన వ్యాపారం అలా అలా ఆకాశందాకా పెరిగి పోతుంది!"

"ఫయిన్!" అన్నాడు పుష్కరాజు.

గంగాధర్ కారును మెల్లగా దూరంలోవున్న రోడ్డు వైపు పోనిచ్చాడు. కాస్సేపట్లో కారు రోడ్డుమీదకు చేరుకుంది. కారు స్పీడును హెచ్చించాడతను.

12

ఇన్‌స్పెక్టర్ మురుగన్ మాధవయ్య భార్యతో మాట్లాడి ఎదురుగా వున్న యింట్లోకి వెళ్ళాడు.

"రండి, ఇన్‌స్పెక్టర్" అన్నాడు నాగరాజన్.

హాలులో సోఫాలో కూర్చున్నాడు ఇన్ స్పెక్టర్. నాగరాజన్ వైపు చూశాడు.

"గతరాత్రి జరిగినది మీరు చూశారా?"

"చూడలేదని చెప్పండి," తలుపు వెనుకనుంచి భార్య ప్రోమ్ట్ చేసింది.

"నేను చూసేసరికి దొంగలు పారిపోయారు."

"ఇక్కడ దొంగతనాలు యెక్కువగా జరుగుతూ వుంటాయా?" అడిగాడు ఇన్ స్పెక్టర్.

"మునుపు జరిగేవి. హోమ్ సెక్యూరిటీ మనుషులు గస్తీ తిరగడం మొదలెట్టాక లేవు."

"ఆ కంపెనీ ఎక్కడుంది?"

నాగరాజన్ లోపలకు వెళ్ళి ఒక కార్డుని తెచ్చి ఇన్ స్పెక్టర్ కి ఇచ్చాడు.

"వాళ్ళకు నేను నెలకు 20 రూపాయలు కడతాను. మా యింట్లో దొంగలు పడకుండా చూసే బాధ్యత వాళ్ళది."

"మాధవయ్య కూడా మెంబరా?"

"ఆయన చేరలేదు. చేరుంటే యీ దొంగతనం జరిగేది కాదేమో!"

"ఎక్కువగా మాట్లాడకండి. ఆయాసం వస్తుంది," సలహా యిచ్చింది భార్య తలుపు వెనకనుంచి.

"ఇప్పుడు జరిగినది హత్య, దొంగతనం మాత్రమే కాదు. వాళ్ళు ఆవును వదిలి పారిపోయారు. ఆవు ఇంటికి తీసుకు రాబడింది."

"మాధవయ్యకు బదులు ఆవు చనిపోయినా బాగుండేది!"

"నిన్నరాత్రి ఆ కంపెనీ మనుషులు గస్తీ తిరిగారా?"

"నిన్న రాత్రి వాళ్ళు తిరగలేదు, ఎందువలనో!"

ఇన్స్పెక్టర్ మురుగన్ లేచి బయటకు నడిచాడు. జీప్ రోడ్డమ్మట దూసుకుపోయింది.

*   *   *

ఇన్స్పెక్టర్ గంగాధర్ వంక నవ్వుతూ చూశాడు.

"మీ సహాయం నాకు కావాలి. నిన్నరాత్రి మీ మనుషులు విజయానగర్, ఏడో వీధిలో గస్తీ తిరిగారా?"

"తిరిగారు."

"అక్కడ గస్తీ ఎవరు తిరుగుతారు?"

"మనుషులను మేం మారుస్తూ వుంటాం. నిన్న ఎవరు తిరిగారో కనుక్కొని చెప్పాలి!"

"కనుక్కోండి!" అన్నాడు ఇన్స్పెక్టర్.

గంగాధర్ బెల్ నొక్కాడు. పుష్కరాజు గదిలో కొచ్చాడు. ఇద్దరూ ఏదో గుట్టుగా మాట్లాడుకున్నారు.

"వీరరాజు, సుబ్బయ్య అక్కడ గస్తీ తిరిగారు."

"వాళ్ళు యిక్కడ వున్నారా?"

"వాళ్ళు ఇక్కడకు ఎప్పుడో గానీ రారు."

"థాంక్స్" అని ఇన్స్పెక్టర్ మురుగన్ బయటకు కదిలాడు.

*   *   *

రోడ్డమ్మట నడుస్తూ లాఠీతో చప్పుడు చేస్తున్న అతడి పక్కనే ఆగింది జీపు.

"నీ పేరు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"పేదరాజు సార్."

"నిన్న రాత్రి ఇక్కడ గస్తీ ఎవరు తిరిగారు?"

"నేనే సార్."

"రాత్రల్లా తిరుగుతూనే వున్నావా?"

"పదింటికి యిటువైపు వచ్చాను. మస్తాన్ గారు స్కూటర్‌లో వచ్చి నన్ను మరోచోటికి వెళ్ళి గస్తీతిరగ మన్నారు."

"మస్తాన్ ఎవరు?"

"మా యజమానండి."

"నిన్న యిక్కడ ఎవ్వరూ గస్తీ తిరగలేదన్నమాట!"

"మిగెవర్నో పంపుతానని మస్తాన్ గారు అన్నారు."

ఇన్‌స్పెక్టర్ మురుగన్ సౌజ్ఞను గుర్తించి డ్రయివర్ జీప్‌ను పోనిచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ ఆలోచిస్తున్నాడు. గంగాధర్ తనకు అసత్యం ఎందుకు చెప్పాడు? మస్తాన్ ఎవరు?

అరగంట తర్వాత జీప్ కాంపౌండులో ఆగింది. మేడ మీద నుంచి పుష్కరాజు కిందకు పరుగెత్తుకొచ్చాడు. ఇన్‌స్పెక్టర్ అతడి వెనకనే మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

ఏర్ కండిషండ్ గదిలో గంగాధర్ సోఫాలో కూర్చునివున్నాడు. టీపాయ్ మీద స్కాచ్ విస్కీ బాటిల్, గ్లాసులు వున్నాయి. గంగాధర్ మంచి నిషాలో వున్నాడు. పుష్కరాజు తూలుతున్నాడు.

"కమాన్ ఇన్‌స్పెక్టర్, మై ఫ్రెండ్! డ్రింక్ సమ్ స్కాచ్ విస్కీ!" అన్నాడు గంగాధర్.

అతడివైపు యిన్‌స్పెక్టర్ సూటిగా చూశాడు.

"మస్తాన్ మీ కంపెనీలో పని చేస్తున్నాడా?"

"ఉద్యోగం మాని వెళ్ళిపోయాడు."

"ఎప్పుడు మానేశాడు?"

పుష్కరాజు గంగాధర్ వెనక్కి జరిగాడు. అతడి మెడమీద నిమిరాడు.

"ఇవాళ నుండి మా నేస్తాడు!"

"అతడి అడ్రెస్ ఇవ్వండి."

"అతడు బొంబాయి వెళ్ళిపోయాడు. ఇంట్లో వుండడు."

ఇన్‌స్పెక్టర్ అతడివంక అనుమానంగా చూశాడు.

"ఈ రాష్ట్రంలో మద్యం నిషేధించబడింది. మీ రిద్దరూ తాగి తూలుతున్నారు!"

"మాకు పెర్మిట్లు వున్నాయి." అన్నాడు గంగాధర్.

"మీ వయస్సుల్లో వున్న వాళ్ళకు ప్రభుత్వం పెర్మిట్లు యివ్వదు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

గంగాధర్ జేబులోంచి వందరూపాయల నోటు తీశాడు.

"ఇన్‌స్పెక్టర్, యీ డబ్బు మీకు వుపయోగ పడుతుందేమో!"

ఇన్‌స్పెక్టర్ మురుగన్ విజిల్ వూదాడు. నలుగురు కానిస్టేబుల్సు గదిలోకొచ్చారు.

"వీళ్ళిద్దర్నీ పోలీస్ స్టేషన్‌కి చేర్చండి!" అర్చాడతను.

* * *

ఇన్‌స్పెక్టర్ మురుగన్‌కి ఎదురుగా ఉమాపతి కూర్చుని వున్నాడు. అతడి కళ్ళు మెరుస్తున్నాయి. "గంగాధర్ వేలిముద్రల్ని మీ సిగరెట్ కేసుమీది వేలిముద్రలతో పోల్చిచూశాం. ఆనాడు మిమ్మల్ని ఆపి, మీ డబ్బును దొంగిలించినది అతడే అని రుజువైంది. చివరకి అతడు అంతా ఒప్పేసుకున్నాడు. పుష్కరాజు మా ముందు

కొండలా పగిలి నిజాన్ని కక్కేశాడు. అటుపైన గంగాధర్ కూడా ఒప్పుకోవలసి వచ్చింది. మీకు చాలా థాంక్స్. మీ సిగరెట్ కేసు నాకు ఆ నాడు యివ్వడం వలన ఒక డేంజరస్ హంతకుడిని మేం పట్టుకోగల్గాం," అన్నాడు ఇన్‌స్పెక్టర్ మురుగన్.

"దొంగగా ప్రారంభించి చివరకు అతడు హంతకుడిగా మారేడన్న మాట?" అడిగాడు ఉమాపతి.

"క్రయిము అగాధంలోకి దిగిన మనిషి ఇంకా అడుక్కి జారిపోతాడు! అప్పుడు నేరశక్తి మనిషికుండదు!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ మురుగన్.

—— :ఐపోయింది :——